4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 24 ఆగస్టు 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ప్రశ్నిస్తే.. దాడులకు తెగబడతారా?

**'మేమొస్తే కంచెలు తొలగిస్తం, హద్దులు చెరిపేస్తం, స్వర్గాన్ని భూలోకానికి దించుతం, ప్రజలను ఆనందలోకాల్లో విహరింపజేస్తం, ప్రజల జీవితాలను బంగారుమయం చేస్తం, రాష్ట్రంలో ప్రజా పాలన తెస్తాం...' ఇవీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఊదుడు బుగ్గల మాటలు. ఆ మాటలతో కట్టిన కోటలు. వారనుకున్నట్టే ప్రజలను నమ్మించి, వంచించిన్రు. కుర్చీ దక్కిన తర్వాత ముఖాలకు వేసుకున్న ముసుగులు తొలగించేసిన్రు. అందుకే, నాడు చెప్పిందేమిటి? నేడు ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారంలో నిజం ఎంత? అనేది నిగ్గు తేల్చేందుకు మీడియా ప్రతినిధులు కొందరు సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లికి పోయిండ్రు. అంతే వారిపై రౌడీమూకలు దాడులకు తెగబడ్డయి. అసలేం జరుగుతున్నది ఈ తెలంగాణ రాష్ట్రంలో?**



**ఎస్పీకే**

శుక్రవారం, పొద్దున 8.30 గంటల సమయం, కొండారెడ్డిపల్లి గ్రామం. రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ అయిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో నిజమెంత? అని తెలుసుకునేందుకు సరిత, విజయారెడ్డి అనే ఇద్దరు మహిళా జర్నలిస్టులు కొండారెడ్డిపల్లికి వెళ్లారు. ప్రజలను కలుస్తూ 'రుణమాఫీ అయిందా, కాలేదా?' అని అభిప్రాయా లను రికార్డు చేస్తున్నారు. అది గమనించిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు వారిని అడ్డుకున్నారు. మహిళలనే ఇంగితజ్ఞానం లేకుండా దురుసుగా ప్రవర్తించారు. జర్నలిస్టు సరితను తోసేస్తే బురదలో పడ్డది. ఆమె మొబైల్, మెమొరీకార్డులను గుంజుకున్నారు. జర్నలిస్ట్ విజయారెడ్డితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఈ క్రమంలో మధ్యలోకి వెళ్లిన సరితను అసభ్యంగా తాకుతూ వేధించారు.

ఆ ఇద్దరు జర్నలిస్టులు ఏడుస్తూ వంగూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కానీ, పోలీసులు ఫిర్యాదును స్వీకరించలేదు. అంటే, రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు ఆ ప్రాంతంలో ఎలాంటి భయానక వాతావరణాన్ని సృష్టించారో అర్థమవుతున్నది. 10 గంటల కల్లా ఈ విషయం సోషల్ మీడియాలో వైరలైంది. న్యూస్‌లైన్, వైఆర్ టీవీ, తెలుగు స్క్రైబ్ చానళ్లు వారికి మద్దతుగా అక్కడికి వెళ్లారు. తోటి జర్నలిస్టులను చూసిన ఆ ఇద్దరు మహిళా జర్నలిస్టులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ క్రమంలో ఎన్నడూ కొండారెడ్డిపల్లికి రాని కొండల్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వస్తున్న ఇతర జర్నలిస్టులను అడ్డుకునేందుకు చాలా ప్రయత్నం చేశాడు. ఈ జర్నలిస్టులకు కొండల్‌రెడ్డి కాన్వాయ్ ఎదురైంది. కారులో వెళ్తున్న జర్నలిస్ట్ శంకర్‌ను చూసిన కొండల్‌రెడ్డి సినీ తరహాలో వేలు చూపిస్తూ బెదిరించాడు. ఆ కారును టార్గెట్ చేసి రెండుమూడు సార్లు అటకాయించే ప్రయత్నం చేశారు. వారు తప్పించుకొని హైదరాబాద్ వైపు వచ్చారు. ఇంతలోనే నాలుగైదు కార్లు శంకర్ కారును తరుముతూ, అడ్డంగా అతి వేగంగా అటకాయించే ప్రయత్నం చేశాయి. ఈ క్రమంలో జర్నలిస్ట్ శంకర్ వెనకాల వస్తున్న సహచర జర్నలిస్టులను అప్రమత్తం చేశారు. ఓ నలుపు రంగు కారు శంకర్ కారుకు అడ్డంగా వచ్చి 'మీరు హైదరాబాద్ ఎట్ల పోతరో చూస్తం బిడ్డా, కొండారెడ్డిపల్లికి వచ్చేంత దమ్ముందారా మీకు?' అంటూ రాయలేని అసభ్యకర భాషలో మాట్లాడుతూ దాడి చేయబోయారు. వారినుంచి తప్పించుకున్న శంకర్ కారు నేరుగా వెల్దండ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నది. ఇతర జర్నలిస్టులూ అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సుమారు 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. పోలీస్ స్టేషన్‌లోనే సరిత, విజయారెడ్డి, శంకర్‌లను బెదిరించారు. అప్పుడే వచ్చిన సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి.. కాంగ్రెస్ నాయకులను, కిరాయి గుండాలను అక్కడినుంచి పంపించేశారు. జర్నలిస్టులపై దాడి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, తదితర బీఆర్ఎస్ నాయకులు కూడా పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.



దాడి ఉదంతాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఎస్పీకి ఫోన్ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో రెండు పోలీసు వాహనాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. దీంతో జర్నలిస్టులు సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుకున్నారు.

> కొండారెడ్డిపల్లి పొరుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జర్నలిస్టులకు ఫోన్‌చేసి.. 'ఈ రోజు కొండారెడ్డిపల్లిలో మీరు దొరికి ఉంటే సగం మంది తిరిగి ప్రాణాలతో ఉండేవారు కాదు' అని చెప్పడం గమనార్హం. ఇవీ.. కొండారెడ్డిపల్లిలో సినీ ఫక్కీలో జరిగిన ఘటనలు.

ముఖ్యమంత్రి సొంతూరు అయినంత మాత్రాన గ్రామంలోకి వెళ్తే జర్నలిస్టులపై దాడులు చేస్తారా? చంపుతామని బెదిరిస్తారా? గతంలో జర్నలిస్టుల మీద ఈ స్థాయిలో దాడులు ఏనాడైనా జరిగాయా? ప్రజాపాలన అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ హయాంలో గత ఎనిమిది నెలల్లో పదుల సంఖ్యలో జర్నలిస్టుల మీద దాడులు జరిగాయి. ఇప్పుడు ఏకంగా చంపేస్తామని బెదిరింపులు మొదలయ్యాయి. ఈ ప్రభుత్వం ప్రశ్నించే జర్నలిస్టుల గొంతుకలపై ఉక్కుపాదం ఎందుకు మోపుతున్నది? ఏ తప్పూ చేయకపోతే జర్నలిస్టులను బెదిరించుడు ఎందుకు? ప్రజల అభిప్రాయాలు తెలుసుకునే హక్కు జర్నలిస్టులకు లేదా? ప్రశ్నించినంత మాత్రాన ప్రైవేటు గ్యాంగ్‌లతో సీఎం తమ్ముళ్లు బెదిరింపులకు పాల్పడతారా? జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? కచ్చితంగా ఉన్నది. 'మాకు ఓటేయండి' అని తెలంగాణ ప్రజలను నమ్మించిన రాహుల్‌గాంధీ మీద, కాంగ్రెస్ పార్టీ మీద కూడా ఆ బాధ్యత ఉన్నది. ప్రశ్నించే గొంతుకలను కాపాడుకోవాల్సిన అవసరం తెలంగాణ సమాజానికి ఉన్నది.

**జై తెలంగాణ! జైజై తెలంగాణ!!**

> **జర్నలిస్టులను చంపేస్తామని బెదిరించినవారిలో నయీం ముఠాలో కీలక సభ్యుడిగా పనిచేసిన శేషన్న కూడా ఉన్నట్టు తర్వాత తెలిసింది. ఆయనే కాదు, నయీం గ్యాంగ్‌లో పనిచేసిన పలువురు మాజీ సభ్యులను యాక్టివేట్ చేసి చురుగ్గా పనిచేస్తున్న జర్నలిస్టులను, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న డిజిటల్ చానళ్ల ప్రతినిధులను బెదిరించడం, టార్గెట్ చేయడం, చంపేయమని టాస్క్ ఇవ్వడం దేనికి సంకేతం? స్వరాష్ట్రం వచ్చిన పదేండ్లలో ఇలాంటి హింసాత్మక ప్రేరేపణలు చూశామా? ఇంతకన్నా ఘోరం ఇంకోటి ఉండదేమో!**



# సిద్ధు మెడకు చుట్టుకున్న ముడా

> **'ముడా' స్థలం కేటాయింపు కుంభకోణానికి సంబంధించి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ జరిపేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ అనుమతి ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. ఓ వైపు కాంగ్రెస్-రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు బీజేపీ-గవర్నర్‌ల మధ్య ఈ విషయమై వాగ్వాదం జరుగుతున్నది.**

గవర్నర్ నిర్ణయాన్ని ఆ రాష్ట్ర క్యాబినెట్ ఖండించింది. అంతేకాదు, దీన్ని రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్ధరామయ్య సర్కార్ ఎదుర్కొన్న అత్యంత తీవ్రమైన రాజకీయ సవాల్ ఇదే. ఈ నేపథ్యంలో గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట వ్యతిరేకమని సిద్ధరామయ్య అన్నారు. గవర్నర్ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాల్ చేస్తామని కూడా ఆయన చెప్పారు. తన ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్రలో ఇది భాగమని పేర్కొన్నారు.

> **ఈ కేసులో ఒకసారి విచారణ ఊపందుకున్నట్టయితే.. సిద్ధరామయ్యపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి రావడం ఖాయం. అయితే ఇది మరో రకంగా కాంగ్రెస్‌కు మేలు చేసే అవకాశం ఉంది. సిద్ధరామయ్య నేతృత్వంలో పార్టీ నేతలను ఏకం చేసేందుకు ఇది దోహదం చేయవచ్చు. మరోవైపు ఈ అంశాన్ని వాడుకొని తమ పార్టీ నాయకులను కూడా ఏకతాటిపైకి తీసుకురావాలని బీజేపీ ఆశిస్తుండవచ్చు.**

విచారణకు అనుమతించవద్దని క్యాబినెట్ చేసిన సూచనను గవర్నర్ గెహ్లోత్ తిరస్కరించారు. ప్రాథమిక దర్యాప్తు నివేదికల పట్ల సంతృప్తి చెందానని, అందుకే విచారణకు అనుమతించినట్టు గవర్నర్ చెప్పారు. ఈ సంతృప్తి అనేది ప్రాథమిక ఆధారాల ద్వారా కాకుండా రాజకీయంగా ఉండవచ్చు. మన దేశంలో గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగపరుస్తున్న తీరును గనుక పరిగణనలోకి తీసుకుంటే.. ప్రభుత్వాన్ని కూల్చాలనే కుట్రలో భాగమేనని వస్తున్న అభియోగాలు రాజకీయ ఆరోపణలు మాత్రమే కాకపోవచ్చు.

'ఆపరేషన్ కమలం'తో పోలిస్తే.. ఇలా గవర్నర్‌ను వినియోగించుకొని తిరుగుబాటును మరింతగా ఎగదోయడమనేది చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్న మార్గం. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు పార్టీ ఫిరాయింపులను వాడుకున్నప్పుడు బాధితుడు నైతికంగా ఉన్నతస్థితిలో ఉంటాడు. అలా కాకుండా అవినీతి అనేది ప్రధానాంశమైతే మాత్రం ప్రభుత్వాన్ని పడగొట్టినవారు కూడా నైతిక విజయం సాధిస్తారు. అయితే బీజేపీ నేతల అవినీతి ఆరోపణలపై కూడా గవర్నర్ ఇదే విధంగా స్పందిస్తారా? అనేది ఇక్కడ ప్రశ్న. ఒకవేళ గవర్నర్ అలా చేయకపోతే అది అతని పక్షపాత వైఖరిని బహిర్గతం చేయవచ్చు. కానీ, ఆయన తీసుకున్న చర్యను మాత్రం ప్రభావితం చేసే అవకాశం లేదు.

> **ముడా కుంభకోణం విషయమై సిద్ధరామయ్య వాదన కూడా నమ్మశక్యంగా లేదు. అతని భార్యకు భూముల కేటాయింపునకు సంబంధించి లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు ఆయన వద్ద సంతృప్తికరమైన సమాధానాలు లేవు. అంతేకాదు, ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదు. ప్రభుత్వం నియమించిన కమిషన్ ఎక్కడికీ వెళ్లకపోవచ్చు. ఈ వాదోపవాదాలు, మాటల యుద్ధం నేపథ్యంలో అవినీతి అనేది చాలా చిన్న అంశంగా మారిపోతున్నది. ముందుగా ఒక అవగాహనకు రావడం, ఆ తర్వాత ప్రభుత్వంపై పోరాటం చేయడమనేది సాకు మాత్రమే. రాజకీయ గోడపై ఉన్న అద్దంలో గనుక చూసుకుంటే ఎవ్వరూ సచ్ఛీలురు కారనే విషయం అవగతమవుతుంది.**

ఇరుపార్టీల నాయకులు ఒకరికొకరు వ్యతిరేకంగా ప్రచారం చేసుకుంటే ఏది గెలుస్తుంది? రాజకీయమా, నైతికతా, ప్రజా ప్రయోజనాలా, వ్యక్తిగత సర్దుబాట్లా? ప్రజలకు తెలుసుకోగల హక్కున్న ఈ వ్యవహారంలోని వాస్తవం ఎప్పటికైనా ఈ వివాదాల నుంచి బయటపడుతుందా? ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లేని సంస్థ ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా విచారణ జరగడం ఇప్పుడు తక్షణావసరం, ఆహ్వానించదగినది కూడా.

('డెక్కన్ హెరాల్డ్' సౌజన్యంతో)

**-ఎడిటోరియల్ డెస్క్**

# జనగణన దిశగా అడుగులు

దేశ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జనగణనకు రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ నుంచి దేశంలో జనాభా లెక్కల ప్రక్రియను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతుండటం శుభపరిణామం. పదమూడేండ్ల తర్వాత జరగనున్న ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు 18 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. చైనాను దాటి అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించిందని గతేడాది ఐక్యరాజ్య సమితి నివేదిక వెలువరించిన నేపథ్యంలో ఈ జనగణన ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

2021లో జరగాల్సిన జనగణన ప్రక్రియ కొవిడ్ కారణంగా ఆలస్యమైన విషయం విదితమే. ఆ తర్వాత పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇది వాయిదా పడుతూ వచ్చింది. జాప్యం కారణంగా పలు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ జనగణనను పూర్తిచేయడం అనివార్యం. దేశ ప్రజల అవసరాలు, సమస్యలను పరిష్కరించేందుకు ఆ డేటా దోహదపడుతుంది. భారత్ లాంటి దేశాలకు ఈ డేటా ఎంతో సహాయకారిగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే, జనాభాలో సంభవిస్తున్న మార్పులు, లింగ నిష్పత్తి, వలసలు, అక్షరాస్యత, పేదరికం, అసమానతలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర వివరాలు దీని ద్వారా తెలుస్తాయి. కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, పట్టణీకరణ వంటి అంశాలు అవగతమవుతాయి. రాష్ట్రాలకు కేంద్ర నిధుల కేటాయింపు నుంచి మొదలుకొని విద్యాసంస్థల ఏర్పాటు, నియోజకవర్గాల విభజన వరకు అనేక అంశాలు ఈ డేటాపైనే ఆధారపడి ఉంటాయి.

తాజా అంచనా ప్రకారం ఆగస్టు 21 నాటికి మన దేశ జనాభా సుమారుగా 145.27 కోట్లు ఉన్నట్టు తెలుస్తున్నది. ఇది ప్రపంచ జనాభాలో 17.78 శాతం కావడం గమనార్హం. ఈ లెక్కన ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ గుర్తింపు పొందింది. అసలు జనగణన అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. దేశంలోని ప్రతీ కుటుంబంలోని సభ్యులను క్రమపద్ధతిలో లెక్కించడం, అవసరమైన ఇతర సమాచారాన్ని సేకరించడం, వాటిని నమోదు చేయడం.. ఇలా అనేక ప్రక్రియలతో ముడిపడినదే జనగణన. సంక్షేమం, అభివృద్ధిపై ఇది ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. అంతేకాదు, జాతీయ శాంపిల్ సర్వే, (దేశ ప్రజల జీవన విధానాలకు సంబంధించి అన్ని అంశాలపై సమాచారాన్ని సేకరించే వరుస సర్వేలు), జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వంటి పలు కీలకమైన అధ్యయనాలకు కూడా ఈ డేటా కీలకం. ఈ నేపథ్యంలో దేశ ప్రగతిలో ఎంతో కీలకమైన జనగణన దిశగా ఇప్పటికైనా అడుగులు పడటం సంతోషకరం.

**- డాక్టర్ కృష్ణకుమార్ వేపకొమ్మ**
98495 62910

# తిడితే మహనీయులు కాలేరు!

> **సమాజాభివృద్ధి కోసం, ప్రజా శ్రేయస్సు కోసం కృషిచేసే మహనీయుల ప్రయత్నాలకు ఆటంకం కలిగించేవారు అడుగడుగునా ఉంటారు. వారిపై దుమ్మెత్తిపోసేవారూ ఉంటారు. ప్రపంచ చరిత్రను ఒకసారి పరికిస్తే మనకు ఈ విషయం అవగతమవుతుంది. కారల్‌మార్క్స్, లెనిన్, స్టాలిన్ లాంటి మహనీయులపై కూడా కొందరు దుష్ప్రచారం చేశారు. అలా దుష్ప్రచారం చేసినవారే కాలగర్భంలో కలిసిపోగా.. ఆ మహనీయులు మాత్రం నేటికీ చిరస్మరణీయులుగా మిగిలిపోయారు. ఈ వాస్తవాన్ని కొంతమంది, ముఖ్యంగా రేవంత్‌రెడ్డి లాంటి గాలివాటం ముఖ్యమంత్రులు అస్సలు తెలుసుకోలేరు. కేసీఆర్‌పై, గత బీఆర్ఎస్ సర్కార్‌పై దుష్ప్రచారం చేస్తూ, రోత మాటలు మాట్లాడుతున్న రేవంత్.. కేసీఆర్ గొప్పతనాన్ని, ఆయన చేసిన మంచి పనులను ఎప్పటికీ గ్రహించలేరు.**



**పాతూరి వేంకటేశ్వరరావు**
98490 81889



గాలివాటమని ఎందుకు అంటున్నానంటే.. కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్‌కు పెట్టుబడి పెట్టి మరీ తెలంగాణలో పార్టీని నడిపించే వారికోసం వెతుకుతున్న సోనియాగాంధీకి కొత్తగా పార్టీలో చేరిన, ఆశావహుడైన రేవంత్‌రెడ్డి కనిపించారు. అంతే, ఆయనను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షున్ని చేసేశారు. అదే సమయంలో తెలంగాణలోనే కాదు, ఇతర రాష్ట్రాలకూ విస్తరించి తనకు, తన పార్టీ బీజేపీకి సవాల్ విసురుతున్న కేసీఆర్‌పై ప్రధాని మోదీ కక్ష పెంచుకున్నారు. అందుకే తెలంగాణలో తన పార్టీ ఓడిపోయినా ఫర్వాలేదు గానీ, రేవంత్‌ను గెలిపించాలనే లక్ష్యంతో ఆయన కేసీఆర్‌ను దెబ్బకొట్టారు. ఇలాంటి పరిస్థితులు దాపురిస్తేనే గదా, మంత్రి కూడా కాని రేవంత్ ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు. దీన్ని దేవుడు తనకిచ్చిన సదవకాశంగా భావించి సద్వినియోగం చేసుకునే దిశగా కాకుండా, చరిత్ర చెత్తబుట్టలో పడిన వదరుబోతు నేతల బాటన పరుగులు పెడుతున్నారు పాపం రేవంత్.

అలాగే ప్రాణాలకు తెగించి మరీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడమే గాక, దశాబ్దంలోనే తెలంగాణను భారతాగ్ర రాష్ట్రాల సరసన చేర్చిన రాజనీతిజ్ఞుడు కేసీఆర్. అలాంటి కేసీఆర్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తున్న రేవంత్‌ను తెలంగాణ ప్రజలే కాదు, ఇరుగుపొరుగు రాష్ట్రాలవారూ ఛీత్కరిస్తున్నారన్న వాస్తవాన్ని గ్రహించలేకపోవడం నిజంగా ఆయన దురదృష్టమే. సర్వోత్తమ సచివాలయాన్ని నిర్మించి, దానికి రాజ్యాంగకర్త అంబేద్కర్ పేరు పెట్టడం, దాని ముందు సమున్నతమైన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడమే కేసీఆర్ ఔన్నత్యానికి, రాజనీతిజ్ఞతకు, మేధోసంపత్తికి నిలువెత్తు నిదర్శనాలు. సచివాలయం ముంగిట సురుచిర, సుందర తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణే కేసీఆర్ తదుపరి లక్ష్యం. అక్కడ స్థల కేటాయింపే అందుకు నిదర్శనం.

> **అంతేగాని, అక్కడ రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని నెలకొల్పడమన్నది ఏ కోణంలో చూసినా అసందర్భం, అహేతుకం. రాజీవ్‌గాంధీ దేశ సేవలో ప్రాణాలు కోల్పోయారన్నది వాస్తవం. ఆయన చిరస్మరణీయుడే. కానీ, రాజీవ్ విగ్రహ స్థాపనకు, తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణకో, హితానికో సంబంధం ఉండాలి కదా?**

ఈ విషయంలో కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీల మెజారిటీ ప్రజల అభిప్రాయం ఇలా ఉంది రేవంత్ జీ. అధిష్ఠానం మెప్పు కోసం గాక, రాజీవ్‌గాంధీపై మీకు అవ్యాజమైన ప్రేమ ఉండి ఉంటే, మిమ్మల్ని ముఖ్యమంత్రిని చేసినందుకు సోనియాగాంధీ కుటుంబం పట్ల కృతజ్ఞతతో మీ సొంత నిధులతోనో లేదా మీలాగే కాంగ్రెస్ పట్ల కృతజ్ఞత కలిగిన మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల విరాళాలతోనో తెలంగాణ ప్రగతికి తోడ్పడే వైద్య కళాశాల, యూనివర్సిటీ లాంటి కట్టడం నిర్మించండి. అందులో మీ అభిమాన రాజీవ్‌గాంధీ సుందర విగ్రహాన్ని ప్రతిష్ఠించి, సోనియాగాంధీతో ఆవిష్కరింపజేయండి. అప్పుడు మిమ్మల్ని తప్పుబట్టే హక్కు ప్రజలకు గాని, పార్టీలకు గాని ఉండదు గాక ఉండదు. అంతేకాదు, తద్వారా తెలంగాణ ప్రజల హృదయాల్లో మీదంటూ ఓ ముద్ర వేసుకోగలుగుతారు.

అంతేకానీ, ఎంతోమంది బలిదానాలతో తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజాధనంతో నిర్మించుకున్న సచివాలయంలో అధికార బలంతో రాజీవ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం సబబు కాదు. అది ఎలా ఉంటుందంటే?.. ఎన్టీఆర్ శ్రమించి నిర్మించుకున్న టీడీపీలో చంద్రబాబు దూరి దాన్ని సొంతం చేసుకున్నట్టు, చీమలు కష్టపడి నిర్మించుకున్న పుట్టలో సర్పం దూరి దాన్ని సొంతం చేసుకున్నట్టు ఉంటుంది. మీ శ్రేయోభిలాషులు సహా మెజారిటీ తెలంగాణ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు రేవంత్ జీ. తస్మాత్ జాగ్రత్త!

# వాళ్లది మహిళా వ్యతిరేక ఆలోచనాధోరణి!



> *బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులది మహిళా వ్యతిరేక ఆలోచనాధోరణి. వారు నారీశక్తి గురించి మాట్లాడతారు కానీ, దేశంలో మహిళలపై దారుణాలు జరిగినప్పుడు మౌనం వహిస్తారు. థానే జిల్లాలోని బద్లాపూర్ (మహారాష్ట్ర)లో బాలికలపై లైంగికదాడి జరిగితే ప్రధాని మోదీ గాని, ఆర్ఎస్ఎస్ నేతలు గాని కనీసం స్పందించలేదు. బీజేపీ నేతృత్వంలోని ఏక్‌నాథ్ షిండే సర్కార్ ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. ప్రజలు రోడ్డెక్కాకే షిండే సర్కార్ విచారణను ముందుకు జరిపింది.*

***- రాగిణి నాయక్, మహారాష్ట్ర కాంగ్రెస్ నేత***

